రుపీ సింబల్‌కు రారాం!

- తమిళనాడులో మరింత ముదిరిన భాషా వివాదం
- బడ్జెట్‌లో అధికారిక రూపాయి చిహ్నం తొలగింపు
- దాని స్థానంలో 'రూ' అర్థం వచ్చే తమిళ అక్షరం చేర్పు
- డీఎంకే ప్రభుత్వ మూర్ఖత్వానికి పరాకాష్ట అన్న విపక్షం
- తమిళ భాషను ప్రోత్సహించే ప్రయత్నంగా చూడాలన్న డీఎంకే

చెన్నై, మార్చి 13: తమిళనాట భాషా వివాదం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 2025-26 రాష్ట్ర వార్షిక బడ్జెట్ కోసం తయారుచేసిన లోగోలో అధికారిక రూపాయి చిహ్నాన్ని తొలగించి ఆ స్థానంలో తమిళ పదం రూబాయిని చేర్చి జాతీయ విద్యా విధానాన్ని(ఎన్ఈపీ) వ్యతిరేకించే విషయంలో తగ్గేది లేదని కేంద్రానికి మరోసారి స్పష్టం చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో మార్చి 14న ప్రవేశపెట్టనున్న రాష్ట్ర వార్షిక బడ్జెట్‌కు సంబంధించిన టీజర్‌ను ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా షేర్ చేశారు. సమాజంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా తమిళనాడు సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ బడ్జెట్‌ని రూపొందించినట్టు స్టాలిన్ ట్వీట్ చేశారు.

రూపాయి సింబల్ రూపకర్త డీఎంకే నేత కుమారుడే

ద్రవిడియన్ మోడల్, టీఎన్‌బడ్జెట్ 2025 హ్యాష్‌ట్యాగులతో విడుదల చేసిన బడ్జెట్ లోగోలో హిందీ అక్షరం ఆర్ స్ఫూర్తితో రూపొందిన అధికారిక రూపాయి చిహ్నం మాయమైంది. ఆ స్థానంలో తమిళ పదం రూబాయికి చిహ్నమైన రూ అనే తమిళ అక్షరం దర్శనమిచ్చింది. గత రెండు వార్షిక బడ్జెట్‌లలో మాత్రం అధికారిక రూపాయి చిహ్నమే లోగోలలో ఉండడం విశేషం. 2023-24 బడ్జెట్ లోగోలో కూడా అధికారిక రూపాయి చిహ్నమే ఉంది. దీన్ని ఐఐటీ-గువాహటి ప్రొఫెసర్ డిజైన్ చేశారు. ఆయన డీఎంకే నాయకుడు కుమారుడు కావడం గమనార్హం.

రూపాయి చిహ్నాన్ని తిరస్కరించడంగా చూడరాదు..

జాతీయ కరెన్సీ చిహ్నాన్ని ఒక రాష్ట్రం తిరస్కరించడం చరిత్రలో ఇదే మొదటిసారి. ఎన్ఈపీ ప్రతిపాదించిన త్రిభాషా సూత్రాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే, అధికారిక రూపాయి చిహ్నాన్ని రాష్ట్రం తిరస్కరించడంగా దీన్ని భావించరాదని డీఎంకే అధికార ప్రతినిధి ఏ శరవణన్ పేర్కొన్నారు. తమిళ అక్షరం రూ ఉపయోగించడం ద్వారా తమిళ భాషను ప్రోత్సహించే ప్రయత్నంగా చూడాలని ఆయన తెలిపారు.

తమిళ ప్రజలను నవ్వులపాలు చేశారు: బీజేపీ

అధికారిక రూపాయి చిహ్నాన్ని మార్చాలన్న తమిళనాడు ప్రభుత్వ నిర్ణయంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కే అన్నామలై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారిక రూపాయి చిహ్నాన్ని మార్చాలని డీఎంకే ప్రభుత్వం నిర్ణయాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మూర్ఖత్వానికి పరాకాష్టగా అన్నామలై అభివర్ణించారు. యావద్దేశం ముందు తమిళ ప్రజలను నవ్వులపాలు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐఏడీఎంకే అధికార ప్రతినిధి కోవై సత్యన్ స్పందిస్తూ ముఖ్యమంత్రి మూర్ఖపు చర్యకు పాల్పడరాదని, రాష్ట్ర హక్కుల పేరిట ప్రజలను రెచ్చగొట్టరాదని చెప్పారు. రూపాయి చిహ్నాన్ని మార్చినందుకు స్టాలిన్‌పై బీజేపీ ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవీయ మండిపడ్డారు. డీఎంకే మాజీ ఎమ్మెల్యే కుమారుడైన ఉన్నత విద్యావంతుడు, డిజైనర్ ఉదయ కుమార్ ధర్మలింగం భారతీయ రూపాయి చిహ్నాన్ని రూపొందించారని, తమిళనాడు బడ్జెట్ నుంచి అధికారిక రూపాయి చిహ్నాన్ని తొలగించి ముఖ్యమంత్రి స్టాలిన్ తమిళ ప్రజలను అవమానించారని విమర్శించారు.

ప్రపంచ వాణిజ్య యుద్ధం అనివార్యం!

ఈయూపై అదనపు సుంకాలు విధిస్తానని ట్రంప్ హెచ్చరిక

న్యూఢిల్లీ, మార్చి 13: యూరోపియన్ యూనియన్ (ఈయూ) వస్తువులపై మరిన్ని సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరిక ప్రపంచ వాణిజ్య యుద్ధానికి దారితీసే ప్రమాదం కనిపిస్తోంది. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ట్రంప్ విధించిన 25 శాతం సుంకం ఫలితంగా అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలు విధిస్తామని కెనడా, యూరోపియన్ యూనియన్ ప్రకటించాయి. దీనిపై ట్రంప్ మరోసారి స్పందించారు. అమెరికా దిగుమతులపై ప్రతీకార సుంకాలు విధించిన పక్షంలో తాము మళ్లీ అదనంగా జరిమానా విధిస్తామని ట్రంప్ బుధవారం ప్రకటించారు. వారు తమ నుంచి ఎంత వసూలు చేస్తారో తామూ అంతే వసూలు చేస్తామని స్పష్టంచేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో అమెరికా అధికారులతో తాము చర్చలను పునరుద్ధరిస్తామని యూరోపియన్ కమిషన్ చైర్మన్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్ బుధవారం ప్రకటించారు. అటువంటి సుంకాలతో తమ ఆర్థిక వ్యవస్థలపై భారం వేయలేమని చైర్మన్ తెలిపారు.

ట్రంప్ విధానాలకు ఎవరూ సురక్షితం కాదు: కెనడా

అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య యుద్ధంతో సహా తమ దేశం ఎదుర్కొంటున్న పెను సవాళ్లను జీ7 విదేశాంగ సదస్సులో ప్రస్తావించడానికి కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ సంసిద్ధమవుతున్నారు. తనకు అత్యంత సన్నిహిత మిత్రదేశమైన కెనడాకే అమెరికా ఈ విధంగా సుంకాలు విధించి శిక్షిస్తే ఇక ఎవరూ సురక్షితం కాదని ఆమె హెచ్చరించనున్నారు. కెనడా ఆతిథ్యమిస్తున్న జీ7 విదేశాంగ మంత్రుల సదస్సులో ఉక్రెయిన్, పశ్చిమాసియా, హైతీ, వెనిజులాపై ప్రధానంగా చర్చ జరగనున్నప్పటికీ అమెరికా సుంకాలు, సార్వభౌమత్వానికి ఎదురవుతున్న హెచ్చరికల గురించి సదస్సులో మిత్రదేశాలకు జోలీ వివరించనున్నారు. అమెరికా వాణిజ్య విధానాలను సమష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరాన్ని, కెనడాకు సహకారాన్ని ఆమె కోరనున్నారు. కెనడా నుంచి దిగుమతి అయ్యే ఉక్కు, అల్యూమినియంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 25 శాతం సుంకాన్ని విధించడం కెనడా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అమెరికా సుంకాలకు ప్రతీకారంగా కెనడా కూడా అమెరికా వస్తువులపై 2000 కోట్ల డాలర్ల విలువైన సుంకాలను విధించింది. అయితే కెనడాను అమెరికాలో విలీనం చేసుకోవడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలలో భాగంగానే ఈ సుంకాల విధింపని కెనడా అనుమానిస్తోంది. అమెరికా ఒత్తిడికి కెనడా లొంగే ప్రసక్తే లేదని జోలీ స్పష్టం చేశారు.

ట్రెండింగ్‌లో 'బాయ్‌కాట్ అమెరికా'

అమెరికా వస్తువుల బహిష్కరణ ఉద్యమం

న్యూఢిల్లీ, మార్చి 13: కెనడా, మెక్సికో, చైనాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు వాణిజ్య యుద్ధాలకు నాంది పలకడంతోపాటు అమెరికా వస్తువులకు వ్యతిరేకంగా 'బాయ్‌కాట్ అమెరికా' పేరిట ప్రపంచవ్యాప్తంగా ఉద్యమానికి దారితీశాయి. *గడచిన వారం రోజులుగా 'బాయ్‌కాట్ అమెరికా' గూగుల్‌లో* ట్రెండింగ్ అవుతున్నది. అంతేగాక, అమెరికా వస్తువుల బహిష్కరణ కోసం అనేక దేశాలు ఫేస్‌బుక్ గ్రూపులను నిర్వహిస్తున్నాయి. డెన్మార్క్‌కు చెందిన పాష్టిక స్వయం ప్రతిపత్తి ప్రాంతం గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవాలన్న ట్రంప్ ప్రయత్నాలు కూడా ఈ వ్యతిరేకతకు ఒక కారణంగా చెప్పవచ్చు. డెన్మార్క్‌కు చెందిన ఫేస్‌బుక్ గ్రూపులో దాదాపు *73,000* మంది సభ్యులు ఉండగా లగ్జెంబర్గ్ తర్వాత అత్యధిక సెర్చ్‌లు ఈ పేజీకే ఉన్నాయి. *గూగుల్‌లో* బాయ్‌కాట్ అమెరికా కోసం అత్యధికంగా సెర్చ్‌లు జరుగుతున్న దేశాలలో స్వీడన్ నాలుగవ స్థానంలో ఉంది. అమెరికా వస్తువులకు వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకు అత్యుత్తమ సాధనంగా ఫేస్‌బుక్ పేజ్ ఉపయోగపడుతోంది. బాయ్‌కాట్ అమెరికా: బై ఫ్రెంచ్ అండ్ యూరోపియన్ పేరిట ఫ్రాన్స్ నిర్వహిస్తున్న ఫేస్‌బుక్ పేజీ *20,000* మంది సభ్యులతో *గూగుల్* సెర్చ్‌లో *3*వ స్థానంలో ఉంది. కెనడా ఇప్పుడు బాయ్‌కాట్ అమెరికా ప్రచారంలో ముందువరుసలో ఉంది. *గూగుల్* సెర్చ్‌లో *5*వ స్థానంలో నిలిచింది.

బహుభర్తృత్వం ఉత్తరాది సంస్కృతి

డీఎంకే మంత్రి వ్యాఖ్యలు

చెన్నై, మార్చి 13: తమిళనాడుకు చెందిన సీనియర్ మంత్రి దురై మురుగన్ గురువారం ఉత్తరాది సంస్కృతిపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. ఉత్తర భారతదేశ సంస్కృతిలో బహు భార్యత్వం, బహుభర్తృత్వం భాగమని ఆయన ఆరోపించారు. తమిళ ప్రజలను ఎవరైనా అవమానిస్తే వారి నాలుకలు కోస్తానని ఆయన హెచ్చరించారు. తమిళ పంప్రదాయాలకు భిన్నంగా ఉత్తర ప్రాంత భారతీయులు బహుభార్యత్వాన్ని, బహుభర్తృత్వాన్ని పాటిస్తారని దురై మురుగన్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఉత్తర భారతం పట్ల డీఎంకే విద్వేష భావాన్ని ప్రతిబింబిస్తున్నాయని బీజేపీ నాయకుడు అమర్ ప్రసాద్ రెడ్డి విమర్శించారు. మంత్రి వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

కాల్పుల విరమణకు అంగీకరిస్తాం

- అది శాశ్వత శాంతికి దారితీయాలి
- వీనిని ఉక్రెయిన్ మళ్లీ ఆయుధాల సేకరణకు వినియోగించుకోరాదు
- అమెరికా ప్రతిపాదనపై పుతిన్

మాస్కో: రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో 30 రోజుల కాల్పుల విరమణకు అమెరికా చేసిన ప్రతిపాదనకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. ఆయన గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఆలోచన సరైనదేనని, తాము కచ్చితంగా మద్దతిస్తామని చెప్పారు. అయితే కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిపై అమెరికాతోనూ, ఇతర భాగస్వాములతోనూ చర్చించవలసి ఉందని తెలిపారు. ఒప్పందాన్ని ఉల్లంఘించడాన్ని నియంత్రించే యంత్రాంగం ఉండాలన్నారు. కాల్పుల విరమణ పాటించే 30 రోజులను ఉక్రెయిన్ తన సైన్యాల మోహరింపు, ఆయుధాల సేకరణల కోసం ఉపయోగించుకుంటుందా అనేది ఓ సమస్య అన్నారు. కాల్పుల విరమణ శాశ్వత శాంతికి దారి తీయాలన్నారు. సంక్షోభానికి మూల కారణాలను నిర్మూలించాలని చెప్పారు. ఉక్రెయిన్‌కు అమెరికా నచ్చజెప్పినట్లు కనిపిస్తున్నప్పటికీ, యుద్ధ క్షేత్రంలో పరిస్థితుల వల్ల ఉక్రెయిన్ ఆసక్తి చూపుతున్నదన్నారు. రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలోకి చొచ్చుకొచ్చిన ఉక్రెయిన్ సేనలను రానున్న రోజుల్లో దిగ్బంధిస్తామని చెప్పారు. ఈ పరిస్థితుల్లో కనీసం 30 రోజుల కాల్పుల విరమణ ఉక్రెయిన్‌కు శ్రేయస్కరమని తెలిపారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్, చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాల నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

హిందీ పరీక్ష మిస్ అయితే మరో చాన్స్

హోలీ నేపథ్యంలో పన్నెండో తరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ వెసులుబాటు

న్యూఢిల్లీ: పన్నెండో తరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ శుభవార్త చెప్పింది. షెడ్యూలు ప్రకారం శుక్రవారం జరిగే హిందీ పరీక్షకు హాజరుకాలేకపోతే వారికి మరో అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్ కంట్రోలర్ సన్యం భరద్వాజ్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం హోలీ పండుగను కచ్చితంగా జరుపుకోవాలనుకునే వారికి వెసులుబాటు కల్పించింది. వారు ఈ పరీక్షను రాయకపోతే, మరో రోజున రాయవచ్చు. జాతీయ, అంతర్జాతీయ క్రీడలలో పాల్గొనేవారికి ప్రత్యేకంగా పరీక్షలను నిర్వహిస్తారు. వారితోపాటు ఈ విద్యార్థులు కూడా హిందీ పరీక్షను రాయవచ్చు.

స్పేడెక్స్ శాటిలైట్ల డీ-డాకింగ్ సక్సెస్

చంద్రయాన్-4కు మార్గం సుగమం

బెంగళూరు: స్పేడెక్స్ శాటిలైట్ల డీ-డాకింగ్(విడదీత) గురువారం విజయవంతంగా జరిగిందని కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. దీని ద్వారా చంద్రుడిపై భవిష్యత్తు పరిశోధనలకు(చంద్రయాన్-4), మానవ సహిత వ్యోమనౌక ప్రయోగానికి, సొంత అంతరిక్ష కేంద్ర నిర్మాణానికి మార్గం సుగమం అవుతుందని ఆయన తెలిపారు. తాజా డీ డాకింగ్ ద్వారా వృత్తాకార కక్ష్యలో డాకింగ్, అన్ డాకింగ్‌ను విజయవంతంగా నిర్వహించే సామర్థ్యాన్ని తాము సంపాదించామని భారత అంతరిక్ష పరిశోధ సంస్థ (ఇస్రో) తెలిపింది.

సునీతా విలియమ్స్ రాక మరింత ఆలస్యం

స్పేస్‌ఎక్స్ ప్రయోగం మళ్లీ వాయిదా

వాషింగ్టన్, మార్చి 13: ఐఎస్ఎస్ నుంచి నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌ల తిరుగు ప్రయాణం మళ్లీ వాయిదా పడింది. స్పేస్‌ఎక్స్ తలపెట్టిన 'క్రూ-10' మిషన్‌కు సంబంధించి రాకెట్ ప్రయోగం మరోమారు నిలిచిపోయింది. స్పేస్‌ఎక్స్ తయారుచేసిన ఫాల్కన్-9 రాకెట్‌లో సాంకేతిక లోపం తలెత్తటంతో గ్రౌండ్ సపోర్ట్ టీమ్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. దీంతో రాకెట్ లాంచింగ్‌ను నిలిపివేస్తున్నట్టు నాసా ప్రకటించింది. రాకెట్‌లో తలెత్తిన సమస్యపై పూర్తిస్థాయిలో సమీక్ష చేశాకే మళ్లీ రాకెట్ ప్రయోగం ఎప్పుడన్నది తేలుతుంది.

పార్కింగ్ వివాదంలో సైంటిస్ట్ మృతి

పంజాబ్‌లోని మొహాలీలో ఘటన

న్యూఢిల్లీ: పంజాబ్‌లోని మొహాలీలో పార్కింగ్ వివాదం మంగళవారం ఓ సైంటిస్ట్ ప్రాణాలను బలి తీసుకుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్‌లో పని చేసిన అభిషేక్ స్వర్నికర్ ఇటీవలే మూత్రపిండాల మార్పిడి చికిత్స చేయించుకున్నారు. డయాలసిస్ జరుగుతున్నది. సీసీటీవీ ఫుటేజ్‌లో కనిపించిన దానిని బట్టి, ఓ బైక్ వద్ద కొందరు వ్యక్తులు నిల్చున్నారు. అభిషేక్ వారితో మాట్లాడి, ఆ బైక్‌ను అక్కడి నుంచి తొలగించారు. కొద్ది క్షణాల్లోనే పోరుగింట్లో ఉండే వ్యక్తి ఆయనపై దాడి చేశాడు. అభిషేక్‌ను తోసేశాడు. ఆయన కింద పడిపోయారు. అతనిపై ఆ వ్యక్తి దాడి చేసి, తీవ్రంగా కొట్టాడు. అభిషేక్ లేచి, నిల్చోలేక కుప్పకూలిపోయారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్యాకల్టీతో మార్నింగ్ వాక్!

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ఐఐటీ గువాహటి చర్యలు

న్యూఢిల్లీ: విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించి ఆత్మహత్యలను నిరోధించడానికి పలు కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని ఐఐటీ గువాహటి నిర్ణయించింది. కొత్త విద్యార్థులు బోధన సిబ్బందితో కలసి మార్నింగ్ వాక్‌కు వెళ్లేలా చేయడం, తప్పనిసరిగా కౌన్సిలింగ్ నిర్వహించడం, వైద్య పరీక్షలు నిర్వహించడం, ఒత్తిడి తట్టుకొనే కార్యశాలలను నిర్వహించడం వంటివి చేపట్టాలని ఐఐటీ యాజమాన్యం నిర్ణయించింది. ఇటీవల కొందరు విద్యార్థుల ఆత్మహత్యపై మిగతా స్టూడెంట్స్ ఆందోళనలు చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

ఆన్‌లైన్ స్నేహం ముసుగులో రేప్

యూకే మహిళపై ఢిల్లీ వ్యక్తి దుశ్చర్య

న్యూఢిల్లీ: సోషల్ మీడియాలో స్నేహితుడిగా ఉన్న ఓ వ్యక్తి తనను హోటల్ గదిలో రేప్ చేశాడని ఓ బ్రిటిష్ మహిళ ఢిల్లీ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. ఈ ఘటన గురించి ఫిర్యాదు చేయడానికి హోటల్ రిసెప్షన్‌కు వెళుతున్నప్పుడు సాయం చేసే నెపంతో మరో వ్యక్తి అదే హోటల్ లిఫ్ట్‌లో తనను లైంగికంగా వేధించాడని ఆమె పేర్కొంది. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు దగ్గరగా ఉన్న మహిపాల్‌పుర్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. నిందితులిద్దరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన నిందితుడితో బ్రిటిష్ మహిళ తరచూ మాట్లాడుతుండేది. ఈ క్రమంలో అతడిని కలవాలని భారత్‌కు వచ్చింది. బుధవారం ఆమెను నిందితుడు హోటల్‌లో కలిసినప్పుడు ఆమెపై నిందితులు లైంగిక దాడులు చేశారు.





40% x 60%

- కర్ణాటకలో కమీషన్ల లొల్లి
- నాగ్‌మోహన్ కమిటీ నివేదిక సమర్పణ
- కాంగ్రెస్-బీజేపీ పరస్పర ఆరోపణలు

బెంగళూరు: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో కమీషన్ల యుద్ధానికి తెరలేచింది. అధికార కాంగ్రెస్, విపక్ష బీజేపీ ఒకరిపై ఒకరు కమీషన్ల ఆరోపణలు చేసుకుంటున్నారు. గత బీజేపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్ల నుంచి 40 శాతం కమీషన్ తీసుకున్నారంటూ వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిన జస్టిస్ హెచ్ఎన్ నాగ్‌మోహన్ కమిషన్ తన నివేదికను ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సమర్పించింది. దీంతో ఇరు పార్టీల మధ్య రగడ ప్రారంభమైంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 60 శాతం కమీషన్ తీసుకుంటున్నదంటూ విపక్ష బీజేపీ ఎదురు దాడికి దిగుతూ పోస్టర్ల యుద్ధాన్ని ప్రారంభించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఫొటోను ఉంచి 'పగలు-రాత్రి దోచుకోండి' అంటూ క్యాప్షన్ పెట్టింది. కాగా, 40 శాతం కమీషన్ ఆరోపణలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి హుబ్బళ్లిలో గురువారం మాట్లాడుతూ దీనిపై విచారణ నిష్పక్షపాతంగా జరగాలని, నివేదికను సభకు సమర్పించాలని డిమాండ్ చేశారు. కమిషన్ విచారణ జరిపిన అంశాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. దీనిపై ఎవరికి నోటీసులు ఇచ్చారు? ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎవరూ నోటీసులు అందుకోలేదని అన్నారు. నోటీసులు ఇస్తే తాము దానికి తగు రీతిలో స్పందిస్తామని, ఇలాంటి వట్టి బెదిరింపులను లెక్కచేయమని అన్నారు. కాగా, జస్టిస్ నాగ్‌మోహన్ సమర్పించిన నివేదిక అందిందని, దీనిపై నేడు మంత్రివర్గంలో చర్చించే అవకాశం ఉందని మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ తెలిపారు.

యూట్యూబ్ చూసి స్మగ్లింగ్ నేర్చుకున్నా

రన్యారావు వెల్లడి

బెంగళూరు: యూట్యూబ్‌లో చూసే బంగారం ఎలా స్మగ్లింగ్ చేయాలో, దొరక్కుండా ఎలాంటి టెక్నిక్కులు వాడాలో నేర్చుకున్నానని స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావు విచారణలో వెల్లడించింది. మార్చి 1వ తేదీన తనకొక ఫోన్‌కాల్ వచ్చిందని, దుబాయ్ ఎయిర్‌పోర్టులో బంగారం సేకరించి, బెంగళూరులో ఒకరికి అందజేయాలని పేర్కొన్నారని తెలిపింది. యూట్యూబ్ వీడియోలు చూసి బంగారాన్ని రహస్యంగా ఎలా దాచాలో, వాటిని ఎలా స్మగ్లింగ్ చేయాలో తెలుసుకున్నానంది. అనంతరం దుబాయ్ ఎయిర్‌పోర్టు బయట కత్తెరలు, బ్యాండేజ్‌లు కొనుగోలు చేసి రెస్ట్‌రూమ్‌లో బంగారు కడ్డీలను తన ఒంటిపై రహస్యంగా అమర్చానని, తనిఖీల్లో దొరక్కుండా వాటిపై బ్యాండేజ్‌లు కట్టినట్టు వివరించింది. తనకు ఫోన్ చేసిన వ్యక్తి, బంగారం అప్పగించిన వ్యక్తి గురించి తనకు తెలియదని చెప్పింది.

వాతావరణ సదస్సు కోసం చెట్లు నరికివేత!

రోడ్డు నిర్మాణం కోసం వేలాది చెట్లను కూల్చేసిన బ్రెజిల్

న్యూఢిల్లీ: వాతావరణ పరిరక్షణ లక్ష్యంతో నిర్వహించే సదస్సు కోసం బ్రెజిల్ చేస్తున్న ఏర్పాట్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (సీఓపీ)-30 వాతావరణ సదస్సుకు వేలాది మంది ప్రతినిధులు హాజరవుతారు. వీరంతా ప్రయాణించడం కోసం ఓ రోడ్డును నిర్మిస్తున్నారు. దీని కోసం అమెజాన్ రెయిన్‌ఫారెస్ట్‌లోని వేలాది చెట్లను నరికేశారు. పర్యావరణ పరిరక్షణ పట్ల బ్రెజిల్‌కు ఉన్న నిబద్ధత ఏమిటని పర్యావరణ ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు. అడవులు పెద్ద మొత్తంలో కార్బన్‌ను శోషించుకుంటున్నాయని, అసాధారణ జీవ వైవిధ్యాన్ని అందిస్తున్నాయని చెప్పారు. కొత్త రోడ్డు వల్ల జీవనోపాధిని కోల్పోతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుండగా, బ్రెజిల్ ప్రెసిడెంట్, పర్యావరణ శాఖ మంత్రి ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. ఇది చారిత్రాత్మక సదస్సు అని చెప్పారు.

సాగు నష్టాలతో ఉత్తమ రైతు ఆత్మహత్య

బుల్దానా: మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి 2020లో 'యువ షేత్కారీ(రైతు)' అవార్డును పొందిన ఓ అన్నదాత అయిదేండ్ల తర్వాత సాగు నష్టాలు భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు. బుల్దానా జిల్లాలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కైలాశ్ నగ్రె(42) శివ్ని అర్మల్ గ్రామంలోని తన పొలంలో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 'సేద్యానికి నీటి సరఫరా లేక పంట దిగుబడి పడిపోయింది. పొలాలకు సాగునీరు అందడం లేదు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని అతడు ప్రభుత్వాన్ని కోరాడు. తన చావుకు ఎవరినీ బాధ్యుల్ని చేయలేదు' అని ఓ అధికారి మృతుడి సూసైడ్ నోట్‌లో ఉన్న విషయాలను వెల్లడించారు.

హార్ట్ ఎటాక్‌కు వ్యాక్సిన్!

బీజింగ్, మార్చి 13: యావత్ ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద అనారోగ్య సమస్య హార్ట్ ఎటాక్ రాకుండా ముందస్తుగానే అడ్డుకునే వ్యాక్సిన్ అభివృద్ధిలో చైనా పరిశోధకులు పురోగతి సాధించారు. ఇది రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోకుండా నివారిస్తుంది. నాన్‌జింగ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు అభివృద్ధి చేసిన వ్యాక్సిన్‌ను ఎలుకలపై ప్రయోగించగా అథెరోస్క్లెరోసిస్ నివారణలో మెరుగైన ఫలితాలు కనిపించాయి.

ఏమిటీ అథెరోస్క్లెరోసిస్...

కొన్ని పరిస్థితుల్లో రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోతుంది. దీనినే అథెరోస్క్లెరోసిస్ అంటారు. దీని వల్ల రక్త సరఫరా నిలిచిపోవడం, స్ట్రోక్స్, హార్ట్ ఎటాక్ వస్తుంది. ఈ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షల మంది మరణిస్తున్నారు. ఈ నేపథ్యంలో రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోకుండా (అథెరోస్క్లెరోసిస్) ముందుగానే అడ్డుకట్ట వేసేందుకు చైనా శాస్త్రవేత్తలు వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు. ఈ వ్యాక్సిన్ ఇంజెక్ట్ చేశాక టీ-సెల్స్ (తెల్ల రక్త కణాలు) యాక్టివేట్ అయి యాంటీబాడీలను ఉత్పత్తి చేస్తాయి. తద్వారా రోగ నిరోధక వ్యవస్థ సక్రమంగా పని చేసి రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోకుండా అడ్డుకట్ట వేస్తుంది.

హార్ట్ ఎటాక్ రావడానికి కారణాలు...

- బీపీ పెరగడం, ఊబకాయం, డయాబెటిస్, కొవ్వు అధికంగా ఉన్న ఆహారం ఎక్కువగా తీసుకోవడం, అతిగా మద్యం సేవించడం, ఒత్తిడి, ధూమపానం, గాలి కాలుష్యం, వ్యాయామం చేయకపోవడం.

భారత్‌లో పరిస్థితి...

- మన దేశంలో *30-40* ఏండ్లవారిలో హార్ట్ ఎటాక్ కేసులు గణనీయంగా పెరుగుతుండటం ఆందోళనకరం.
- *40-69* ఏండ్లవారి మరణాలకు *45* శాతం హార్ట్ ఎటాక్ కారణమని ఓ అధ్యయనంలో తేలింది.

పెండ్లితో మగాళ్లలో ఊబకాయం!

పోలండ్ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి

వార్సా, మార్చి *13*: పెండ్లి ప్రభావం వల్ల మగవాళ్లు లావెక్కుతున్నారట! వార్సాలోని నేషనల్ కార్డియాలజీ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తల తాజా పరిశోధన ఈ విషయాన్ని తెలిపింది. పెండ్లయ్యాక పురుషులు వారి భార్యలతో పోలిస్తే 3.2 రెట్లు ఊబకాయులవుతున్నట్టు తెలిసింది. పెండ్లి వల్ల పురుషులు 62 శాతం, మహిళలు 39 శాతం లావెక్కుతున్నారు. ఆహారం తీసుకొనే పరిమాణం పెరగడం, బయటి తిండి, వ్యాయామం తగ్గిపోవడం లాంటి కారణాల వల్ల పెండ్లైన పురుషులు లావైపోతున్నారని వారు తెలిపారు. అదే మహిళల విషయానికి వస్తే సామాజిక ఒత్తిళ్ల కారణంగా వారు తమ బరువు పెరగకుండా జాగ్